E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు

## తెలుసుకుందాం !

### ఆగస్టు 20: చరిత్రలో ఈరోజు

**1866: అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ అంతర్యుద్ధం ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు**

**1920:డెట్రాయిట్, మిచిగాన్‌లో, మొదటి వాణిజ్య రేడియో స్టేషన్ తన కార్యకలాపాలను ప్రారంభించింది**

**1938: లూ గెహ్రిగ్ తన రికార్డు స్థాయిలో 23వ కెరీర్ గ్రాండ్ స్లామ్ సాధించాడు.**

**1940: మెక్సికోలో లెవ్ ట్రోత్స్కీపై దాడి జరిగింది.**

బుధవారం తెలుగు గళం 20 ఆగస్టు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్

## 'ఆ' చాట్‌బాట్‌లను తొలగించాలని మెటాను కోరిన బ్రెజిల్ ప్రభుత్వం




బ్రసీలియా : లైంగిక అసభ్యకరమైన వ్యాఖ్యలతో కూడిన చాట్‌బాట్‌లను తొలగించాలని బ్రెజిల్ ప్రభుత్వం మెటాను కోరినట్లు అటార్నీ జనరల్ కార్యాలయం (ఎజియు) తెలిపింది. చిన్నారుల భాష మరియు రూపాన్ని కలిగి ఉన్న ప్రొఫైల్‌లను అనుకరించే మరియు లైంగికంగా అసభ్యకరమైన సంభాషణల్లో పాల్గొనేందుకు అనుమతించే ఎఐ రోబోట్‌లను మెటా వెంటనే తొలగించాలని బ్రెజిల్ ప్రభుత్వం కోరినట్లు ఎజియు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మరియు వాట్సప్‌ల వంటి మెటా ప్లాట్‌ఫామ్‌ల వినియోగదారులు కంపెనీ జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, (ఎఐ) స్టూడియోను వినియోగించి ఇటువంటి బాట్‌లను సృష్టించే అవకాశం ఉంది.

ఇటువంటి బాట్‌ల విస్తరణను గతవారం మెటాకు పంపిన నోటీసులో ఖండించింది. ఇవి పిల్లల్లో శృంగారాన్ని ప్రోత్సహిస్తున్నాయని పేర్కొంది. మైనర్లుగా నటిస్తున్న బాట్‌లతో లైంగిక సంభాషణలకు సంబంధించిన పలు ఉదాహరణలను నోటీసులో ప్రస్తావించింది.

## 30 మందిని చంపిన ఎడిఎఫ్ రెబల్స్

కాంగో : డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి)లోని ఉత్తర కీవ్ ప్రావిన్స్‌లోని బాపెరే గ్రామంలో ఎడిఎఫ్ (అలియడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్) తిరుగుబాటు దారులు జరిపిన దాడుల్లో 30 మందికిపైగా పౌరులు మృతి చెందారు. ఈ విషయాన్ని సైనిక అధికారులు, స్థానిక పౌర సమాజ నేతలు తెలిపారు. బుధవారం %-% శుక్రవారం మధ్య ఎడిఎఫ్ రెబల్స్ జరిపిన దాడుల్లో ఇళ్లకు నిప్పంటించారు. కత్తులతో పొడిచినట్లు బాధితులు తెలిపారు. ఎడిఎఫ్ రెబల్స్ వందమందిని బంధీలుగా చేశారని, ఇలాంటి



చర్య వల్ల మరిన్ని దారుణాలకు దారితీస్తుందనే భయాలను పెంచుతోందని.. ఓ స్థానికుడు తెలిపాడు. ఎడిఎఫ్ రెబల్స్‌కి అమెరికా మద్దతు ఉంది. ఈ సాయుధ గ్రూపు ఉగాండా ఇస్లామిస్ట్ గ్రూపుకి చెందినది. డిఆర్‌సిని ఆక్రమించుకునేందుకే ఎడిఎఫ్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే డిఆర్‌సి ప్రావిన్స్‌లలో దాడులు జరిపి పౌరుల్ని అతిదారుణంగా చంపుతోంది. కాగా, కాంగో, ఉత్తర కివీలో రైయా, ముటోంబోకితో సహా సాయుధ గ్రూపులు పౌరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఈ ఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎడిఎఫ్ ఉగాండా సరిహద్దుకు సమీపంలో ఉన్న కాంగోలోని ఉత్తర కివీ ప్రావిన్స్‌లో పనిచేస్తోంది.

## ఇజ్రాయిల్ దాడుల వల్ల 74 మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడులకు 74 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. సోమవారం జరిగిన ఈ దాడుల్లో 36 మంది మానవతా సహాయం కోరుతున్నవారేనని వైద్యవర్గాలు తెలిపాయి. గాజాలోని పౌరులకు కనీస అవసరాలు తీర్చడానికి 600 ట్రక్కులు అవసరం. కానీ ఇజ్రాయిల్ మాత్రం కేవలం 86 ట్రక్కులను మాత్రమే గాజాలోకి అనుమతిస్తుంది. అంటే సుమారు 14 శాతం మాత్రమేనని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం డేటా తెలిపింది.



కాగా, ఇజ్రాయిల్ మానవత్వానికి వ్యతిరేకంగా మారణహోమం చేస్తుంది. ఈ మారణహోమాన్ని ఆపాలని అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని సీనియర్ హమాస్ అధికారి ఒసామా హమ్దాన్ అన్నారు. అక్టోబర్ 7. 2023లో ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల వల్ల 60,933 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. 150,027 మందికి గాయాలయ్యాయి.

## మా భద్రతకు భరోసా ఇవ్వండి : అమెరికా నుంచి స్పష్టమైన హామీ కోరిన జెలెన్‌స్కీ

**• ట్రంప్‌తో ముగిసిన భేటీ**

వాషింగ్టన్ : రష్యాతో శాంతి ఒప్పందం అంగీకరించడం కోసం అమెరికా తమ భద్రతకు భరోసా ఇవ్వాలని, వివిధ అంశాల్లో సహాయం చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ స్పష్టమైన హామీని కోరారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జెలెన్‌స్కీ సోమవారం వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ సురక్షితంగా ఉండటానికి ఏమి అవసరమో ట్రంప్‌నకు జెలెన్‌స్కీ వివరించారు.



ఇందులో ఆయుధాల అమ్మకాలు, ఉక్రెయిన్ సైన్యానికి శిక్షణ వంటి అంశాలు ఉన్నాయి. యూరోపియన్ నాయకులతో చర్చించిన తరువాత వివరాలు వెల్లడిస్తానని ట్రంప్ తెలిపారు. పుతిన్‌తో మాట్లాడతానని, ముగ్గురి మధ్య సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నానని ట్రంప్ తెలిపారు. సోమవారం ముందుగా వైట్‌హౌస్‌కు చేరుకున్న జెలెన్‌స్కీకి ట్రంప్ స్వాగతం పలికారు. జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. యుద్ధాన్ని ఆపేందుకు, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చొరవ తీసుకుంటున్నందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. రష్యా, అమెరికాతో త్రైపాక్షిక సమావేశానికి తాము సిద్ధంగా ఉన్నట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం అలాస్కా వేదికగా రష్యా అధ్యక్షులు పుతిన్‌తో ట్రంప్ సమావేశం అనంతరం ఈ భేటీ నిర్వహించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. జెలెన్‌స్కీతో సమావేశం తరువాత ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు యూరప్, నాటో నేతలు తరలివచ్చారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటో చీఫ్ మార్క్ రుట్టె తదితరులు వైట్‌హౌస్‌కు చేరుకున్నారు.

## 6,000కు పైగా విద్యార్థుల వీసాల రద్దు

వాషింగ్టన్ డిసి : సుమారు 6,000కు పైగా విద్యార్థుల వీసాలను అమెరికా విదేశాంగశాఖ రద్దు చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. వలసచట్టం అమలు మరియు జాతీయ భద్రతా ఇబ్బందులను తగ్గించడం వంటి ప్రయత్నాల్లో భాగంగా వీసా రద్దు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నేరాలు, ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలు సహా అమెరికా చట్టాలను ఉల్లంఘించడం,




ఎక్కువకాలం దేశంలో ఉండటం వంటి కారణాలతో ఈ వీసాలను తిరస్కరించినట్లు సమాచారం.'ఫాక్స్ న్యూస్ కథనం ప్రకారం.. స్టేట్ డిపార్ట్‌మెంట్ 6,000 కంటే ఎక్కువ మంది విద్యార్థుల వీసాలను రద్దు చేసిందని ఫాక్స్ న్యూస్ కథనాన్ని మేము ధృవీకరించాము. వాటిలో అధిక భాగం దాడి, దోపిడీ, మద్యం లేదా మాదకద్రవ్యాలను వినియోగించి వాహనాలు నడపడం (డియుఐ), ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వంటివి ఉన్నాయి" అని ఆ అధికారి చెప్పారు.

## గగన్‌యాన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది : శుభాంశుశుక్లా




న్యూఢిల్లీ : భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొందని వ్యోమగామి శుభాంశు శుక్లా తెలిపారు. పలువురు శాస్త్రవేత్తలు ఇందులో భాగస్వామ్యమవ్వాలని కోరుకుంటున్నారని అన్నారు. భారత్ చేరుకున్న శుభాంశు సోమవారం సాయంత్రం ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. శుక్లాతో సంభాషణకి సంబంధించిన వీడియోను మంగళవారం ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)కు తన అంతరిక్ష ప్రయాణం, సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడం మరియు ఆర్బిటల్ ల్యాబ్‌లో తాను నిర్వహించిన ప్రయోగాలను గురించి తన అనుభవాలను పంచుకున్నారు.

## జర్నలిస్టులపై దేశద్రోహం అభియోగాలను ఖండించిన ప్రెస్ క్లబ్

న్యూఢిల్లీ : 'దివైర్'కి చెందిన సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లపై దేశద్రోహం అభియోగాలను జర్నలిస్టుల సంఘం ఖండించింది. జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్‌థాపర్‌లపై అసోం పోలీసుల క్రైమ్ బ్రాంచ్ భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 కింద దేశద్రోహ అభియోగాలు మోపడంపై ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ) మరియు ఇండియన్ వుమెన్ ప్రెస్ కార్ప్స్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. రెండు నెలల్లో ఆ వార్తా సంస్థపై ఇది రెండవ ఎఫ్ఐఆర్ అని ఆ సంస్థలు తెలిపాయి. అసోం గౌహతిలోని క్రైమ్ బ్రాంచ్ ద్వారా జర్నలిస్టులపై ప్రతీకార చర్యలు



తీసుకున్నారని వారు ఆరోపించారు.

సీనియర్ జర్నలిస్టులపై ఉన్న కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)ఎలో పొందుపరిచిన భావప్రకటనా స్వేచ్ఛకు ముప్పు కలిగించే బిఎన్ఎస్‌లోని "అమానుషమైన" సెక్షన్ 152ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా గొంతుకను అణచివేసేందుకు అసోం పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్ 152ని ఆయుధంగా ఉపయోగించారని తెలుస్తోందని అన్నారు.

మిగతాది 3వ పేజీలో

## ఇసిఐ, బిజెపిల మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యం : రాహుల్ గాంధీ



పాట్నా : ఓటర్ అధికార్ యాత్రలో మూడోరోజు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)పై దాడి కొనసాగించారు. ఇసిఐ బిజెపితో భాగస్వామ్యం కలిగి ఉందని అన్నారు. మంగళవారం ఉదయం పునామా నుండి యాత్రను తిరిగి ప్రారంభించారు. మార్గం మధ్యలో వజీర్‌గంజ్‌లో పాఠశాల పిల్లలను కలిశారు. అనంతరం నవాడలోని భగత్‌సింగ్ చౌక్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

బిజెపి, ఇసిఐల మధ్య భాగస్వామ్యం కొనసాగుతోందని, వారిరువురు కలిసి ఓట్లను దొంగిలిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును మోడీ, అమిత్‌షాలు ఇసితో కలిసి లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర, హర్యానా, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికల కమిషన్‌తో కలిసి బిజెపి ఓట్లను దొంగిలించిందని అన్నారు. లోక్‌సభ మరియు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య ఇసిఐ సుమారు కోటి మంది కొత్త ఓటర్లను సృష్టించిందని అన్నారు. ఈ కోటి మంది ఎవరు అని తాము ప్రశ్నించినపుడు ఇసిఐ వద్ద ఎలాంటి సమాధానం లేదని అన్నారు. వీడియో ఫుటేజీలకోసం డిమాండ్ చేసినపుడు వారు, చట్టాన్ని మార్చారని అన్నారు. ఇప్పుడు బీహార్‌లో ఎస్ఐఆర్ ముసుగులో, బిజెపి, ఇసి ఓట్లను దొంగిలిస్తున్నాయని, ఓట్ల చోరీ నుండి వారిని తప్పించుకోనివ్వమని అన్నారు. ఓట్ల చోరీ గురించి మాట్లాడుతూ.. ముందుగా ఓటరు కార్డులను తీసివేస్తామని, తర్వాత రేషన్ కార్డులు , భూములను లాక్కుంటామని, వాటిని అదానీ, అంబానీలకు బహుమతిగా ఇస్తామని అన్నారు. ఈ

మిగతాది 3వ పేజీలో

## తిరుమల విధుల్లో కానిస్టేబుల్ నిజాయితీ



తిరుమల : తిరుమలలో విధుల్లో ఉన్న ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ జి రాజీవ్ నిజాయితీ చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన జ్యోత్స్న ఈ నెల 18 రాత్రి శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తూ బ్యాగుల తనిఖీ స్కానింగ్ కేంద్రం వద్ద తన హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్నారు. అందులో రూ. 2,07,494 నగదు ఉన్నట్లు టిటిడి సిబ్బందికి ఫిర్యాదు చేశారు. కాగా హ్యాండ్‌బ్యాగ్‌ను గుర్తించిన ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ రాజీవ్ ఆమెకు సమాచారం అందించి భరోసా ధైర్యం చెప్పారు. మంగళవారం వేకువజామున వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో సదరు యాత్రికురాలికి హ్యాండ్‌బ్యాగ్‌ను అప్పగించి అందరి ప్రశంసలు పొందారు.

## నందమూరి పద్మజ భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళి

హైదరాబాద్: నందమూరి పద్మజ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు,లోకేశ్ నివాళులర్పించారు. ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ అనారోగ్యంతో బాధపడుతూ ఇవాళ ఉదయం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జయకృష్ణ నివాసానికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. పద్మజ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జయకృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## జీఎస్టీ కౌన్సిల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

కేంద్ర ప్రభుత్వం ధరల తగ్గింపుపై నిజంగా ఆసక్తి కలిగి ఉంటే, పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఆయన కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. కేటీఆర్ అభిప్రాయం ప్రకారం, కేంద్రం ప్రజల మీద జీఎస్టీ భారాన్ని తగ్గించినట్లు ప్రచారం



చేస్తోంది. కానీ నిజానికి వారి చర్యల్లో అసలు చిత్తశుద్ధి కనిపించడంలేదని చెప్పారు. ఇంధన ధరలు తగ్గిస్తేనే ప్రజలకు నిజమైన లాభం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎందుకంటే, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే వినియోగదారులపై భారం తగ్గుతుంది. దాని ప్రభావంతో అన్నీ వస్తువుల ధరలు స్వాభావికంగా తగ్గుతాయి.

## బీరువాను బహూకరించిన 1978-79 ఎస్.ఎస్. సీ బ్యాచ్




**తెలుగు గళం హన్మకొండ న్యూస్**

ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఔదార్యం ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 1978 -1979 బ్యాచ్ కి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆరున్నర ఫీట్ల స్టీల్ బీరువాను బహూకరించారు . 47 సంవత్సరాల క్రితం తాము పాఠశాలలో చదువుకున్న ప్రాంతాన్ని నదయాడుతూ, తమ పాఠశాల రోజులను, తమ గురువులను, తమ స్నేహితులను గుర్తు చేసుకున్నారు . ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్ కు చెందిన విద్యార్థులు సుదర్శన్ రెడ్డి ,రమేష్ ,దయాకర్ ,సామిల్ ,జయ ప్రకాష్, ఈశ్వర్, రామమూర్తి, శనగం, బుచ్చిమల్లు, చింత శోభ లతోపాటు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్, ఉపాధ్యాయులు కవిత, సురేష్ ,కిరణ్మయి, రామకృష్ణ ,ప్రసన్న ,రమ్యశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాండ్ బజార్ ఏర్పాటుతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకెంతో ప్రయోజనం

- **ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలో సాండ్ బజార్ లో ఇసుక లభ్యం**
- **స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
- **హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



తెలుగు గళం హన్మకొండ న్యూస్

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో సాండ్ బజార్ ను ఏర్పాటు చేసిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, టిజిఎండిసి అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసిఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సాండ్ బజార్ లో నాణ్యమైన ఇసుక ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాండ్ బజార్ లో అందుబాటులో ఉన్న నాణ్యమైన ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీజీఎండిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాండ్ బజార్ లో వినియోగదారులకు సరిపడే విధంగా ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇసుక కోసం వచ్చే లబ్ధిదారులకు సిబ్బంది ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సాండ్ బజార్ లో లభించే ఇసుకను తీసుకోవడానికి ఆన్లైన్లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, ఆన్లైన్లో బుక్ చేసుకోవడం రాని వారికి సిబ్బందినే ఆన్లైన్లో ఇసుక బుకింగ్ చేసి అందించాలన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నందున ఆయా గ్రామాలలో ఇసుక అవసరాలను గుర్తించి ఆయా గ్రామాల వద్దకే ఇసుకను తీసుకెళ్లడానికి ఉన్న మార్గాలను చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 80% ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ అయిందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఇది అత్యధికమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు తక్కువ ధరలో లబ్ధిదారులకు ఇసుక అందించడమే లక్ష్యంగా సాండ్ బజార్ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ రేట్ లో సాండ్ బజార్ లో ఇసుక లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఇసుకను అందించే సాండ్ బజార్ ఏర్పాటుతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఉనికిచర్ల వద్ద రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాండ్ బజార్లో నాణ్యమైన ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీజీఎండిసి అధికారులు మాట్లాడుతూ టీజీఎండిసి పోర్టల్ ద్వారా, లేదా మీసేవ కేంద్రాల ద్వారా, ఆన్లైన్లో ఇసుకను బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎండిసి నోడల్ అధికారి శ్రీనివాస్, పిడి హౌసింగ్ సిద్ధార్థ నాయక్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి ప్రాజెక్ట్ అధికారులు విష్ణువర్ధన్, వినయ్, రాజు, స్థానిక తహసిల్దార్ సదానందం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## ముప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు బిల్లు పొందిన లబ్ధిదారురాలు

- **మొదటి విడత రూ.ఒక లక్ష అకౌంట్ లో జమా**
- **హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారు అన్నం పవిత్ర- అశోక్**



తెలుగు గళం హన్మకొండ న్యూస్

ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లులు అకౌంట్ లో జమా అవుతున్నాయి. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో మొదటి విడత బేస్ మెంట్ వరకు నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా లబ్ధిదారులకు బిల్లులు ఖాతాల్లో జమా చేసారంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లుకేటాయించిన ,ముప్పారగ్రామ అభివృద్ధి ప్రధాత చామల వాసుదేవ రెడ్డికి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు,గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

# మద్యపానం వల్ల కలిగే లాభాలు-నష్టాలు

# తాత్కాలిక ఆనందం-శాశ్వత నష్టం







తెలుగు గళం న్యూస్ డెస్క్

మనిషి జీవితంలో ఆరోగ్యం అమూల్యమైన సంపద.ఆరోగ్యం ఉన్నవాడే నిజమైన ధనవంతుడు.ఈ ఆరోగ్యానికి మద్యం ఎంతమాత్రం సహాయపడుతుంది? లేదా హాని చేస్తుందా? అన్న ప్రశ్న చాలామందికి కలుగుతుంది.కొంతమంది వైన్ లేదా బీర్ వంటి మద్యం మితంగా తీసుకుంటే గుండెకు మేలు చేస్తుందని,ఒత్తిడి తగ్గుతుందని భావిస్తారు.నిజమే,కొన్ని శాస్త్రీయ పరిశోధనలు కూడా మితమైన మోతాదులో మద్యం రక్తప్రసరణను మెరుగుపరుస్తుందని పేర్కొన్నాయి.అంతేకాకుండా సామాజిక సంబంధాలు,స్నేహితులతో మమేకం అయ్యే సందర్భాలలో కూడా మద్యం ఉపయోగిస్తారని చాలామంది చెప్పుకుంటారు.కానీ ఇవన్నీ తాత్కాలిక లాభాలే.దీని వెనక దాగి ఉన్న భయంకరమైన నష్టాలను మనం విస్మరించకూడదు.మద్యపానం క్రమంగా వ్యసనంగా మారి మనిషి ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది.కాలేయం క్షీణించి సిరోసిస్,లివర్ క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయి.రక్తపోటు,గుండె సంబంధిత సమస్యలు,మధుమేహం,కిడ్నీ వ్యాధులు మరింతగా పెరుగుతాయి.మానసిక సమస్యలు,జ్ఞాపకశక్తి తగ్గడం,డిప్రెషన్ వంటి సమస్యలు కూడా అధికమవుతాయి.మద్యం కేవలం శారీరక నష్టాలు మాత్రమే కాదు,కుటుంబ జీవనాన్ని కూడా దెబ్బతీస్తుంది.మద్యపానం వల్ల గృహహింసలు,కుటుంబ విభేదాలు,ఆర్థిక నష్టం ఎక్కువగా కనిపిస్తాయి.మద్యం తాగి వాహనం నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు సమాజానికి మరింత భయంకరమైన విపత్తులు.అందువల్ల మనం మద్యాన్ని ఆరోగ్యానికి మేలు చేస్తుందనే అపోహలో కాకుండా,దీని వల్ల కలిగే దీర్ఘకాలిక నష్టాలను గ్రహించాలి.నిజమైన ఆనందం,శాంతి,ఆరోగ్యం మద్యపానం వల్ల రాదు.సదాచార జీవనం,క్రమమైన వ్యాయామం,సమతుల్యాహారం,ఆధ్యాత్మికత,కుటుంబ ప్రేమ,ఇవే మనిషి జీవితానికి నిజమైన బలాలు.మద్యపానం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువ.కాబట్టి దీన్ని పూర్తిగా నివారించడం మన ఆరోగ్యం,కుటుంబం,సమాజం కోసం అత్యవసరం.

## జఫర్‌గడ్‌లో సిపిఎం పార్టీ సర్వే

**అంతర్గత రోడ్లు గుంతలమయం-పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్**





తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు,మురికి కాలువలు, పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని సిపిఎం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం టౌన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రావర్తి సోమయ్య,మండల కార్యదర్శివర్గ సభ్యుడు కాట సుధాకర్ మాట్లాడారు.వారు మాట్లాడుతూ..పలు కాలనీల్లో రోడ్లు గుంతలమయమై నడవలేని పరిస్థితి నెలకొన్నదని,ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి కాలువల్లో మురుగునీరు నిలిచిపోతున్నదని పేర్కొన్నారు.వర్షాలతో గుంతలుగా మారిన రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని,ప్రతి వాడలో సిసి రోడ్లు,కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు.అలాగే అస్తవ్యస్తమైన పారిశుధ్య కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి శుభ్రత పనులు చేపట్టాలని కోరారు.ఈ సర్వే కార్యక్రమంలో నాయకులు నల్లతీగల శ్రీను,జఫర్‌గడ్ టౌన్ కార్యదర్శి సాకి నరసింగం,ఎల్మకంటి సుధాకర్,బాబు,నముద్రాల దేవయ్య,కాట బిక్షపతి,బి.అనిల్,సముద్రాల రాజు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## తమ్మడపల్లిలో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ అన్నెపు పద్మా అశోక్



**తెలుగు గళం న్యూస్ జాఫర్‌ఘడ్**

జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన గాజుల ఎల్లయ్య కుమారుడు సంపత్ కుట్టుమిషిన్ పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి మాజీ సర్పంచ్ అన్నెపు పద్మ అశోక్ రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సహాయం కడియం శ్రీహరి ఆదేశాల మేరకు అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టిమల్ల కృష్ణమూర్తి,గ్రామ శాఖ అధ్యక్షులు రావర్తి చంద్రయ్య,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి ప్రభాకర్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పాక నరసయ్య,డాక్టర్ నరసయ్య,డాక్టర్ మల్లయ్య,చాడ సత్యనారాయణరెడ్డి,దిడ్డి రాజహంస,కూరపాటి విజయ్ కుమార్,అంబేద్కర్ విగ్రహ అధ్యక్షులు గాదె అంబేద్కర్,విఘ్నేశ్వర యూత్ అధ్యక్షులు పులి హరీష్ కుమార్,సుధ,గాని యాదగిరి,పొట్టచర్ల అనిల్,సొన్నాయిలా నాగరాజు,మాచర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.సహాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ అన్నెపు పద్మ అశోక్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## మలక్ పల్లి గ్రామంలో నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

**అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం-ఎస్సై జానీపాష**



ధర్మసాగర్ (తెలుగు గళం),ఆగస్టు 19

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మలకపల్లి గ్రామంలో నిషేధిత గుట్కా అమ్మకాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారం పోలీసులకు అందింది.వెంటనే ధర్మసాగర్ ఎస్ఐ జానీ పాషా సిబ్బందితో కలిసి గ్రామంలో దాడి నిర్వహించారు.ఈ దాడిలో సుమారు రూ.24 వేల విలువైన అంబర్ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ జానీ పాషా మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుట్కా విక్రయం,వినియోగం పూర్తిగా నిషేధించబడిందని,అయినప్పటికీ కొంతమంది లాభాల కోసం ఇలాంటి వ్యాపారం చేస్తున్నారని హెచ్చరించారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.దాడిలో కానిస్టేబుళ్లు రాము,బిక్షపతి,కుమారస్వామి పాల్గొని గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసి సాక్ష్యాలతో పాటు కేసు నమోదు చేశారు.గ్రామంలో అక్రమ వ్యాపారాలపై నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని పోలీసులు వెల్లడించారు.

## ప్రాణాలైనా అర్పిస్తాం-ఎస్సీ వర్గీకరణ రద్దు వరకు పోరాటం-పసుల రాంమూర్తి



**తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ/వరంగల్**

న్యూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగిన "మాలల పోరాట గర్జన సభ" విజయవంతమైంది.సభలో జాతీయ అధ్యక్షుడు డా. పసుల రాంమూర్తి మాట్లాడుతూ.. "ఎస్సీ వర్గీకరణ దళితులను విభజించే కుట్ర.ప్రాణాలైనా అర్పించి దీన్ని అడ్డుకుంటాం'' అని హెచ్చరించారు.ఆయన 11 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వాల ముందు ఉంచారు.వాటిలో ఎస్సీ రిజర్వేషన్లు 20% చేయడం, మూడెకరాల భూమి పంపిణీ,ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు,కేజీ-పీజీ ఉచిత విద్య, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ముఖ్యమైనవిగా ఉన్నాయి.ఈ సభకు నాగర్ కర్నూలు ఎం.పి. మల్లు రవి మద్దతు తెలిపారు.

SAI BALAJI DIGITALS PVT LTD

## జనగామ బ్రిడ్జి మరమ్మతులు చేయాలని సిపిఎం డిమాండ్



**తెలుగు గళం న్యూస్ జనగామ**

జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్ నుండి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వరకు రైల్వే క్రాసింగ్ కోసం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని సిపిఎం పట్టణ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషాకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి,ఎండి హజారుద్దీన్, మంగ బీరయ్య, బండ సౌందర్య,గాజుల నాగరాజు తదితరులు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బూడిది గోపి మాట్లాడుతూ...గత 38 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మత్తులు జరగలేదని అన్నారు. దీంతో ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడి,పెచ్చులు ఊడిపోతున్నాయని,ముఖ్యంగా రైల్వే లైన్ ఇరువైపులా ఉన్న మెట్ల దారులు కూలిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన 42 లైట్లలో కేవలం 10 మాత్రమే వెలుగుతున్నాయి. గవర్నమెంట్ హాస్పిటల్ ముందు చీకటిలో రాత్రిపూట రోగులు,వారి బంధువులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి సైడ్లలో పెరిగిన రాగి చెట్ల వేరు,కాండాలు పూర్తిగా తొలగించకపోవడం వల్ల భవిష్యత్తులో బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిపిఎం ప్రతినిధి బృందం బ్రిడ్జి తక్షణ మరమ్మతులు చేయాలని,మెట్ల దారులను పునర్నిర్మించాలని,లైటింగ్ సదుపాయం మెరుగుపరచాలని కలెక్టర్‌ను డిమాండ్ చేసింది.

## జర్నలిస్టులపై దేశద్రోహం అభియోగాలను ఖండించిన ప్రెస్ క్లబ్

"ఇండోనేషియాకు భారత రక్షణ అనుబంధ అధికారి కెప్టెన్ (భారత నావికాదళం) శివకుమార్ ఇచ్చిన వివరణ ఆధారంగా జూన్ 28న ది వైర్‌లో ప్రచురితమైన కథనంపై బిజెపి నేత దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ రూపొందించారు. 2025, జులై 11న మోరిగావ్‌లో అసోం పోలీసులు సెక్షన్ 152 మరియు బిఎన్ఎస్‌లోని ఇతర నిబంధనల కింద దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌పై జర్నలిస్టులు వరదరాజన్, 'దివైర్'లోని జర్నలిస్టులందరికి బలవంతపు చర్యల నుండి రక్షణ కల్పించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయినప్పటికీ ఆగస్ట్ 12న, పోలీసులు సమన్లు జారీ చేయడం గమనార్హం. ఇప్పుడు ఎటువంటి కారణం లేకుండానే అసోం పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వరదరాజన్, థాపర్‌లను ఆగస్ట్ 22న గౌహతిలోని క్రైమ్ బ్రాంచ్‌లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్ట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు".అని జర్నలిస్టుల సంఘాలు పేర్కొన్నాయి.

ఐపిఎస్ సెక్షన్ 124ఎ కింద దేశద్రోహం చర్యలు మరియు క్రిమినల్ ప్రాసిక్యూషన్లను నిలిపివేయాలని 2022 మేలో సుప్రీంకోర్టు ఆదేశించిందని జర్నలిస్టు సంఘాలు తెలిపాయి. బిఎన్ఎస్‌లోని సెక్షన్ 152 అనేది సెక్షన్ 124ఎ రీప్యాకేజ్ వెర్షన్ అని, గతవారం తన రిట్ పిటిషన్‌లో, దివైర్ సెక్షన్ 152 నిబంధనలను సవాలు చేసిందని, సుప్రీంకోర్టు అసోం ప్రభుత్వం మరియు ఇతరులకు నోటీసులు జారీ చేశాయని పేర్కొన్నాయి. దివైర్, వరదరాజన్‌లకు గతవారం సుప్రీంకోర్టు ఉపశమనం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వరదరాజన్,థాపర్‌లపై పోలీసుల చర్యలు భారత్‌లోని మీడియాను లక్ష్యంగా చేసుకోవడానికి సెక్షన్ 152 ఒక సాధనంగా మారిందని స్పష్టం చేస్తోందని జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి.

## వరంగల్ లో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు



తెలుగు గళం న్యూస్ వరంగల్

రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ-మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని,సాఫ్ట్ ఇన్ఫోటెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేత మరియు వరంగల్ ఈస్ట్ కాంగ్రెస్ కొండా సోషల్ మీడియా కోఆర్డినేటర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జ చందు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ మరియు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జ చందు మాట్లాడుతూ..."మా అభిమాన నాయకురాలు కొండా సురేఖ మురళీధర్ రావు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండి పేదలకు ఎల్లప్పుడూ సేవ చేసే శక్తి భగవంతుడు ఇవ్వాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం"అన్నారు. ఇన్స్టిట్యూట్ విద్యార్థులు మాట్లాడుతూ.."ఫీజులు చెల్లించే స్తోమత లేని వందలాది మంది విద్యార్థులకు,కొండా దంపతుల వారసురాలు కొండా సుష్మిత పటేల్ పేరు మీద ఉచిత కంప్యూటర్ కోర్సులు,స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది"అని తెలిపారు. అలాగే గజ్జ చందు మాట్లాడుతూ.."రాబోయే రోజుల్లో కూడా కొండా సురేఖ మళ్లీ మంత్రిగా అవతరించాలని మేమంతా కోరుకుంటున్నాం''అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ స్టాఫ్,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రేగొండ నూతన ఎస్సైగా కే రాజేష్ బాధ్యతలు

## భూపాల్ పల్లి విఆర్ కు బదిలీ అయిన సందీప్ కుమార్



తెలుగుగళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల నూతన ఎస్సైగా కే రాజేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేసిన సందీప్ కుమార్ భూపాల్ పల్లి వి ఆర్ కు బదిలీ అయ్యారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐగా విధులు నిర్వహించిన కే రాజేష్ బదిలీపై రేగొండకు వచ్చారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ కారే ఆదేశాల మేరకు మంగళవారం రేగొండలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పనిచేస్తానని అన్నారు,ప్రజలు తనకు సహకరించాలని కోరారు, నేరాల నియంత్రణలో ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

## బురదమయంగా మారిన రోడ్డుపై నాట్లు వేసిన గ్రామస్థులు




తెలుగు గళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి

రోడ్డు నిర్మాణం జరపాలంటూ రోడ్డు పై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్ పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామం నుండి వెంకటేశ్వర్లు పల్లి కి వెళ్లు ప్రధాన రహదారి గత కొన్ని సంవత్సరాలుగా ధ్వంసం అయ్యి దుర్భరంగా మారిందని ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులకు,అధికారులకు రోడ్డు మరమ్మత్తులు చేయాలని విన్నవించిన పట్టించుకోవడం లేదని గత వారం రోజులనుండి కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు బురదమయంగా మారి రైతులకు,విద్యార్థులకు,ప్రయాణికులకు,ఇబ్బందికరంగా మారిందని,ప్రమాదాలు జరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని రోడ్డు పై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

## గవర్నమెంట్ ప్లిడర్ సుధాకర్ ను సత్కరించిన టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి డబ్బేట రమేష్



లుగుగళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో గవర్నమెంట్ ప్లిడర్ గా నియమించబడిన బోట్ల సుధాకర్ ని మర్యాదపూర్వకంగా టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి డబ్బేట రమేష్ ఆధ్వర్యంలో కలిసి శాల్వతో సత్కారంచడం జరిగింది. ఈ సందర్భంగా డబ్బేటా రమేష్ మాట్లాడుతు సుధాకర్ దళిత జాతిలో పుట్టి పెరిగినందుకు,ఆ జాతికి వన్నెతెచ్చినందుకు గర్విస్తున్నామని అన్నారు.

అంతేకాకుండ భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. దళితులను గిరిజనులను గుర్తించి వారికి సముచితస్థానం ఇచ్చినందుకు సంతోషిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నత్తి కార్నల్, రాజేష్ ఖన్నా, గంజి లక్ష్మణ్, కొలేపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి- సిపిఎం

తల్లాడ గళం న్యూస్



తల్లాడ స్థానిక మండల ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న ధర్నాకు సిపిఎం తల్లాడ మండల కమిటీ మద్దతు తెలిపింది ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు తాళ్లరాణి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అత్యంత భయంకరమైన పరిస్థితుల్లో ప్రతి ఇల్లు తిరుగి ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించిన సమయంలో కొంతమంది కరోనాతో చనిపోయారని ఇప్పటికీ ప్రతిరోజు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆశా వర్కర్లు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఉండటం అంటే ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు ఆశా వర్కర్లను పెట్టి చాకిరి చేస్తున్నారని అన్నారు ఎమ్మెల్యేలు ఎంపీలు వారి జీతాలు పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న పనిచేస్తున్న ఆశా వర్కర్లకు వేతనాలు పెంచడంలో లేదని అన్నారు పారితోషకాలు కాకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగులకు కల్పించే అన్ని సౌకర్యాలను కల్పించాలని అన్నారు వారి న్యాయమైన డిమాండ్లను సాధించేవరకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో పులి కృష్ణయ్య కళ్యాణపు కృష్ణయ్య షేక్ మస్తాన్ చల్లా నాగేశ్వరరావు గుంటుపల్లి వెంకటయ్య సత్తెనపల్లి వీర రాఘవులు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ముచ్చింతల ఎల్లారావు శంకర్ ధనలక్ష్మి కృష్ణకుమారి ఉమా జ్యోతి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

### పీఆర్టీయూ టీ.ఎస్ మండల అధ్యక్షులు గీరెడ్డి ప్రమోద్ రెడ్డి



తెలుగు గళం న్యూస్,స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 19

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ను వెంటనే రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీ.ఎస్ మండల అధ్యక్షులు గీరెడ్డి ప్రమోద్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయం ఎదుట సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో జరగబోయే మహాధర్నా పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అజెండాలో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మహాధర్నాలో మండలంలోని ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొని తమ ఆవశ్యకతను ప్రభుత్వానికి చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వంగ రఘు,ఎంఈఓ జి.కొమురయ్య,జి హెచ్ ఎమ్ ఎమ్.సంపత్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే.ప్రకాశం,ఎ.భాస్కర్ రెడ్డి,వి.మురళి,పి.వెంకటేశ్వర్లు,వై.రాగమని,శైలజ,చంద్రశేఖర్ రెడ్డి,కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ షబరీష్



ధర్మసాగర్,ఆగస్టు 19 (తెలుగు గళం)

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవల స్థితిగతులు,ఇన్‌పేషెంట్-ఔట్‌పేషెంట్ రికార్డులు,మందుల నిల్వలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో జ్వర సర్వేలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'టిబి ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా ఇప్పటివరకు 820 మందికి స్క్రీనింగ్,84 మందికి ఎక్స్‌రే పరీక్షలు చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ అరుణ దేవి వివరించారు. హై రిస్క్ గ్రూపులపై మరిన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ దేవి,ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్,వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## తిప్పర్తి లో ఐద్వా శిక్షణా తరగతులు



తెలుగు గళం న్యూస్ నల్గొండ/ తిప్పర్తి,ఆగస్టు 19

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. మంగళవారం తిప్పర్తి నర్రా రాఘవరెడ్డి స్మారక భవనంలో జరిగిన ఐద్వా జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత దేశంలో మహిళలపై దాడులు,అత్యాచారాలు,హత్యలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలన్న భావజాలం ఇప్పటికీ కొనసాగుతుండటం ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలపై అవమానకర ఘటనలు తరచుగా జరుగుతున్నాయని,మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆమె విమర్శించారు. మహిళలు ఏ వృత్తిలోనైనా రాణించగలరని,సమాజ అభివృద్ధిలో వారికి కీలక పాత్ర ఉందని గుర్తించాల్సిన సమయం వచ్చిందని మల్లు లక్ష్మి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధుల ప్రవర్తనలో మార్పు రాకపోతే ఐద్వా మహిళా సంఘం ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ..మహిళలపై దాడులను ఎదుర్కోవడంలో,సంఘాన్ని బలోపేతం చేసుకోవడంలో శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. మూఢనమ్మకాలు వీడి చైతన్యవంతులై కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి మహిళలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోలే బోయిన వరలక్ష్మి,జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ,జిట్టా నరోజ,నిమ్మల పద్మ,తుమ్మల పద్మ,చి.నాగమణి,పాదూర్ గోవర్ధన,ఎస్కే సుల్తానా,కారం పూడి ధనలక్ష్మి,దామెర లక్ష్మి,జంజారాల ఉమా,మాలే భార్గవి,అరుణ,ఊర్మిళ,పోకల రఘాన్సీ,మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. శిక్షణా తరగతిలో శాస్త్రీయ ఆలోచన విధానంపై యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్ చారి, ఐద్వా సంఘ నిర్మాణ పద్ధతులుపై రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి బోధించారు.



## తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ధర్నా

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య సిఐటియు మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలి. ఆగస్టు నెల పారితోషికాలు ఆలస్యం చేయకుండా గతంలో చెల్లించినట్లు సకాలంలో చెల్లించాలి. ఫిక్సిడ్ వేతనం రూ.18,000/-లు,2023 సెప్టెంబర్ అక్టోబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా ఆనాటి ఉన్నతాధికారులు ఆశా యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో జరిపిన చర్చలు ఇచ్చిన కొన్ని నిర్దిష్టమైన హామీలను ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాము. గత ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలతో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశాము, సమస్యల పరిష్కారం కోసం కోరి వద్ద జరిగిన ధర్నాల సందర్భంగా రాష్ట్ర ఉన్నతాధికారులు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు ఇస్తామని, టార్గెట్స్ రద్దు చేస్తామని, ప్రమోషన్స్ కల్పిస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు వెంటనే ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలి లేని పక్షంలో ఆందోళన పోరాటాలకు సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ యాచారం మండల నాయకురాలు శోభ రాణి, సుశీల ,నరసమ్మ ,లలిత, స్వాతి, పద్మ ,ఎల్లమ్మ, బాలామణి, సైదమ్మ, నాగమణి ,లక్ష్మి ,గరిష, రమాదేవి ,గోవిందమ్మ, లలిత ,అస్మదవేగం, వైదేవి, అలవేలు, నరసమ్మ, బాలమ్మ ,పద్మ, మంజుల, రమాదేవి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

## జఫర్‌గఢ్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఘనంగా ప్రారంభం






తెలుగు గళం న్యూస్ జఫర్‌గఢ్,ఆగస్టు 19

పిఎం శ్రీ పథకం కింద ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ తెలంగాణ గురుకుల పాఠశాలలో ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానాచార్యులు ఎన్.వరలక్ష్మి నేతృత్వం వహించగా,బోధన సిబ్బంది,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ ల్యాబ్‌లో విద్యార్థులు 3డి ప్రింటింగ్,రోబోటిక్స్,ఎలక్ట్రానిక్స్,కోడింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందనున్నారు.అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ల్యాబ్,ఆవిష్కరణ,సృజనాత్మకత,శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు వేదికగా నిలవనుంది.ప్రధానాచార్యులు మాట్లాడుతూ..పిఎం శ్రీ పథకం ద్వారా ఏర్పాటైన ఈ అటల్ ల్యాబ్ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది.వారు రేపటి రోజుల్లో ప్రపంచ స్థాయి ఆవిష్కర్తలుగా ఎదగగలుగుతారు అని పేర్కొన్నారు.ప్రారంభోత్సవంలో విద్యార్థులు రూపొందించిన ఆటోమేటిక్ లైటింగ్ సిస్టమ్,స్మార్ట్ డస్ట్‌బిన్,సోలార్ పవర్ మోడల్స్ వంటి వినూత్న ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

## అటల్ థింకరింగ్ ల్యాబ్స్ -విద్యార్థులు కలలు నిజం చేసుకునే వేదిక

తెలుగు గళం న్యూస్ బ్యూరో రిపోర్ట్

నేటి కాలంలో విద్య అంటే కేవలం పుస్తకాల్లోని జ్ఞానం మాత్రమే కాదు.సృజనాత్మకత,ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం కూడా అవసరం.ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ థింకరింగ్ ల్యాబ్స్ ను ఏర్పాటు చేసింది.ఈ ల్యాబ్స్‌లో విద్యార్థులు సైన్స్,టెక్నాలజీ,ఇంజినీరింగ్,గణితం పట్ల ఆసక్తి పెంపొందించుకోవచ్చు.తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రాక్టికల్‌గా పరీక్షించే అవకాశం ఇక్కడ ఉంటుంది.రోబోటిక్స్ కిట్స్,3డి ప్రింటర్స్,సెన్సర్స్,ఎలక్ట్రానిక్ కిట్స్ వంటి పరికరాలు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి.ఒక చిన్న విద్యార్థి తన ఊరిలో తాగునీటి సమస్యను గమనించి,ఎటిఎల్ ల్యాబ్‌లోని పరికరాలతో నీటిని శుద్ధి చేసే సులభ యంత్రం తయారు చేశాడని ఊహించుకోండి.ఇంకొకరు స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ రూపొందించాడు.ఈ విధంగా చిన్న వయస్సులోనే విద్యార్థులు పెద్ద సమస్యలకు పరిష్కారాలు వెతుకుతారు.అటల్ థింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణా దృక్పథం పెంపొందుతుంది.రేపటి శాస్త్రవేత్తలు,ఆవిష్కర్తలు,వ్యాపారవేత్తలు ఇక్కడి నుంచే రూపుదిద్దుకుంటారు.నిజానికి ఎటిఎల్ అనేది కొత్త తరం కలలను నిజం చేసే వేదిక.

## సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని జఫర్గఢ్ లో ఉపాధ్యాయుల నిరసన




తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్,ఆగస్టు 19

సెప్టెంబర్ 1,2024 తర్వాత అమలు చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ క్రమంలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద పిఆర్టీయుటిఎస్ సంఘ ఆధ్వర్యంలో చేపట్టబోయే మహా ధర్నా కార్యక్రమ పోస్టర్‌ను జఫర్‌గడ్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.మండల శాఖ అధ్యక్షులు కే.సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి యు.రామారావు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.పద్మ,మండల,జిల్లా,రాష్ట్ర శాఖ బాధ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని,పెన్షన్ అనేది ప్రభుత్వ భిక్ష కాదని,ఉద్యోగి ప్రాథమిక హక్కు అని 1982లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.మహా ధర్నాలో ప్రతి సిపిఎస్ ఉపాధ్యాయుడు బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి.సదానందం,శ్రావణ్‌కుమార్,రాష్ట్ర బాధ్యులు సుధాకర్,వెంకటేశ్వర రెడ్డి,జిల్లా బాధ్యులు సోమయ్య,మండల కార్యదర్శులు శివరాణి,భాస్కర్,జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 20 నెలల పాలన రాక్షస పాలనగా మారింది




చిల్పూర్ మండలం,క్రిష్ణాజిగుడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి వర్యులు, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రెస్ మీట్ నిర్వహించారు.కాంగ్రెస్ 20 నెలల పాలన రాక్షస పాలనగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు చేసిందేమీ లేదని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, కాంగ్రెస్ నాయకులు మౌనం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు.మాజీ సీఎం కేసీఆర్ పాలనలో మూడు నెలల ముందుగానే లక్షల క్వింటాళ్ల యూరియా సమకూర్చి రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకున్నారని గుర్తుచేస్తూ, "రేవంత్ రెడ్డి రైతులను మళ్లీ లైన్లలో నిలబెట్టే రోజులు తెచ్చాడు" అని రాజయ్య వ్యాఖ్యానించారు.అప్పుల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు చేసిన అబద్ధపు ప్రచారాలు పార్లమెంట్‌లోనే బట్టబయలయ్యాయని ఆయన తెలిపారు. గత 10 సంవత్సరాల్లో 2.80 లక్షల కోట్ల అప్పులు చేసి, 4 లక్షల కోట్ల సంపద సృష్టించామని, అనేక అభివృద్ధి పనులు, కట్టడాలు నిర్మించామని గుర్తు చేశారు. అయితే, కేవలం 20 నెలల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2 లక్షల కోట్ల అప్పులు చేసి, ఢిల్లీకి కప్పం కడుతోందని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా కడియం శ్రీహరి గారిపై కూడా డాక్టర్ రాజయ్య గారు తీవ్రంగా విరుచుకుపడ్డారు. "పార్టీ మారి ప్రజలను మోసం చేసిన కడియం శ్రీహరికి ప్రజల ముందు మాట్లాడే నైతిక హక్కు లేదు. నీతి, నిజాయితీ ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి.అదేవిధంగా, బీహార్ ఎన్నికల కారణంగా తెలంగాణలో చేయని పనులు చేశామని ప్రకటనలు ఇస్తున్నారని, అంతేకాక రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్లను కూడా బీహార్‌లో వినియోగిస్తున్నారని ఆయన విమర్శించారు.

## ఎరువుల కోసం రైతులకు ఇబ్బందులు రానీయవద్దు



### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

తెలుగు గళం హన్మకొండ న్యూస్

వ్యవసాయ సాగులో కావాల్సిన విత్తనాలు, యూరియా సహా ఇతర ఎరువులు, పురుగు మందుల కోసం పిఎసిఎస్, గ్రోమోర్ కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువులు పురుగు మందులు విత్తనాల గోదాం, మన గ్రోమోర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద యూరియా, ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ ప్రక్రియను కలెక్టర్ దాదాపు నలభై నిమిషాల పాటు అక్కడే ఉండి పరిశీలించారు. పలు ఆధారాలతో యూరియాతోపాటు ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం వచ్చిన రైతుల వివరాలను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. పిఎసిఎస్, మన గ్రోమోర్ కేంద్రాలలో సరిపోను యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలు ఉన్నాయా లేదా అని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంలో రైతుల వివరాలను త్వరగా నమోదు చేసి రైతులకు కావలసిన యూరియా సహా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అందించాలన్నారు. బయోమెట్రిక్ సిగ్నల్స్ లేవనే కారణంగా రైతులకు ఇబ్బందులు రానీయవద్దని, బయోమెట్రిక్ సిగ్నల్స్ బాగుండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. యూరియా సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. యూరియా సరఫరా సక్రమంగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా కొరత రానీయకుండా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు కలెక్టర్ తో మాట్లాడారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్ సదానందం, మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాంకీ కార్మికుల వేతన ఒప్పందం తక్షణం చేయాలని

### కార్మిక శాఖ కార్యాలయం వద్ద నిరసన

కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఈరోజు (ఆగస్టు 19) నిరసన రాంకీ (హెచ్ఐఎంఎస్‌డబ్ల్యుసి & టి) ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈరోజు (తేది: 19%-08-%2025)న కార్మిక శాఖ కార్యాలయం, అంజయ్య భవన్, హైదరాబాద్ వద్ద భారీ నిరసన జరిగింది. ఈ కార్మికులు ఆగస్టు 18 నుండి వేతనాలు పెంచాలని నిరవధిక సమ్మెలో ఉన్నారు. ఈ సంస్థలో పనిచేసే డ్రైవర్లు, హెల్పర్లకు 18 నెలల నుండి తీవ్రమైన జాప్యం చేస్తున్నది. యాజమాన్య నిర్లక్ష్య వైఖరి విడనాడాలని చార్టర్ ఆఫ్ డిమాండ్స్ యూనియన్ అందజేసింది. యాజమాన్య వైఖరిలో మార్పు లేనందున కార్మిక శాఖ జెసిఎల్ కార్యాలయం వద్ద అనేక దఫాలు చర్చలు జరిగాయి. యూనియన్ డిమాండ్ చేసినట్లు డ్రైవర్లకు రూ.6,500/%-%లు, ఆ తర్వాత గ్రేడ్ వారికి రూ.6,300/%-%లు మరియు హెల్పర్లకు రూ.5,500/%-%లు జీతాలు పెంచాలని యాజమాన్యానికి ప్రతిపాదించింది. ఒక దశలో సానుకూలంగా స్పందించిన యాజమాన్యం వెనక్కి పోవడంతో ఈ సమ్మె అనివార్యమైంది. చట్టబద్ధంగా, శాంతియుతంగా జరుగుతున్న సమ్మెను విచ్ఛిన్నం చేసే యాజమాన్య చర్యలకు స్వస్తి చెప్పకపోతే ఈ సమ్మె మరింత ఉధృతమవుతుందని పాలడుగు భాస్కర్, యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లో 42 సైట్లలో పనిచేస్తున్న ఈ కార్మికులకు ఎలాంటి మౌలిక సదుపాయాలు సమకూర్చకుండా మంచినీరు, బాత్‌రూమ్ సౌకర్యం వంటి కనీస వసతులు కల్పించకుండా వెట్టి చాకిరి చేయించుకోవడాన్ని తీవ్రంగా నిరసించారు. రాంకీ డంపింగ్ యార్డ్ కార్మికుల సమ్మె వలన హైదరాబాద్ నగర ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని హెచ్చరించారు. కార్మిక శాఖ ఇప్పటివరకు సంయమనం పాటిస్తూ కార్మికుల తరపున చేస్తున్న ప్రయత్నం కొనసాగించాలని, యాజమాన్యంపై మరింత ఒత్తిడి పెంచి వేతన సవరణ జరిగేలా చూడాలని కోరారు. రాంకీ యాజమాన్యం ప్రతిష్టకు పోకుండా వేతన సవరణను తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. అయినా యాజమాన్యం తన మొండి వైఖరి విడనాడకపోతే జిహెచ్ఎంసి కార్మికులు సంఘీభావంగా ఆందోళనా కార్యక్రమాలకు పూనుకుంటారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ (సిఐటియు) అనుబంధ కార్మికులు వేలాదిగా ఆందోళనా కార్యక్రమాలు తలపెడతారని ప్రకటించారు.




యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. అశోక్ అధ్యక్షతన వహించిన ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా? పాలడుగు భాస్కర్, వి.ఎన్. రావు, ఆర్‌టిసి%-%ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి, జె. వెంకటేష్, జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, జె. చంద్రశేఖర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, ఐ. రమేష్, యూనియన్ నాయకులు వై. కుమారస్వామి, ఎన్. సతీష్, డి. శ్యామ్‌రాజు, డి. మస్తాన్, బి. రవీందర్, వై. వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు బి. శ్రీనివాస్, జె. భాస్కర్, సిహెచ్. దుర్గాస్వామి, ఎ. రాజేష్, ఎస్. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 104 ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలి, కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలి సీఐటీయూ

104 ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం కోసం ఈరోజు ప్రజాభవన్ లో ముఖ్యమంత్రి గారి పేరిట ప్రజాభవన్ ఇన్చార్జి ఐఏఎస్ ఆఫీసర్ దివ్య మేడం గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. 104 ఉద్యోగస్తులకు ఐదు మాసాలుగా వేతనాలు లేవు అలాగే కంటిన్యూవేషన్ కూడా లేదు. రాష్ట్రవ్యాప్తంగా 10 91 మంది ఉద్యోగస్తులకు కొనసాగింపు ఉత్తర్వులు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 710 మందికి మాత్రమే కంటిన్యూవేషన్ ఇచ్చింది. మిగిలిన వారికీ ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో ఐఏఎస్ అధికారి దివ్య మేడం గారు మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ కమిషనర్ మరియు హెల్త్ సెక్రటరీ గారితో మాట్లాడి వేతనాలు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తామని మిగిలిన వారికి కొనసాగింపులు కూడా ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.




ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు భూపాల్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. విజయవర్ధన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి నవీన్ మరియు 10 జిల్లాల నుండి 104 ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి, టిడిపి, జనసేన కూటమితో వైసిపి కుమ్మక్కు

### ఎన్‌డిఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపర్చడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

### కూటమి అభ్యర్థికి ఎలా మద్దతిస్తారని ప్రశ్న

అమరావతి బ్యూరో : ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి అభ్యర్థిని బలపరచాలన్న వైసిపి నిర్ణయం రాష్ట్ర ప్రజలను వంచనకు గురిచేయడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి దేశ వ్యాప్తంగా మత కల్లోలాలు సృష్టిస్తూ ప్రజల మధ్య విషబీజాలు నాటుతోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అదానీ లాంటి కార్పొరేట్లకు ధారదత్తం చేస్తోందని, అటువంటి బిజెపి ఆర్‌ఎస్‌ఎస్‌ల కొమ్ము కాయడం అంటే లౌకికతత్వానికి, మత సామరస్యానికి భంగం కలిగించడమే అవుతుందని పేర్కొన్నారు. బిజెపి, ఎన్‌డిఏ కూటమి రాష్ట్రానికి తీవ్ర హానీ చేస్తోందని, గత 11 సంవత్సరాలుగా విద్రోహ పూరిత విధానాలు




అనుసరిస్తోందని ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు అమలు జరపలేదని పేర్కొన్నారు. అఖరికి విశాఖ సీట్లు ప్లాంటు ప్రైవేటుపరం చేస్తున్నా రెండు ప్రధాన పార్టీలు గుడ్లప్పగించి చూస్తున్నాయని విమర్శించారు. ఒక్కొక్క డిపార్టుమెంటును 3ప్రైవేటుపరం చేసుకుంటూ పోతున్నా మాట్లాడటం లేదని, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న ఇలాంటి ఎన్‌డిఏ కూటమికి వైసిపి ఎలా మద్దతు ఇస్తుందో రాష్ట్ర ప్రజలకు బహిరంగ వివరణ ఇవ్వాలని కోరారు. ప్రతిరోజూ ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హక్కుల కోసం టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమికి వ్యతిరేకంగా గంభీరమైన ప్రసంగాలు చేస్తున్న వైసిపి అదే ఎన్‌డిఏ కూటమికి చెందిన ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపర్చడం అంటే టిడిపితో కుమ్మక్కు కావడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు.

## ఇసిఐ, బిజెపిల మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యం: రాహుల్ గాంధీ

ఓట్ల చోరీ గురించి మాట్లాడుతూ.. ముందుగా ఓటరు కార్డులను తీసివేస్తామని, తర్వాత రేషన్ కార్డులు , భూములను లాక్కుంటామని, వాటిని అదానీ, అంబానీలకు బహుమతిగా ఇస్తామని అన్నారు. ఈ దేశం కొంతమంది పారిశ్రామిక వేత్తల సొంతం కాదని, యువత, రైతులు, చిన్న వ్యాపారులదని అన్నారు. కానీ ఇక్కడ ప్రతీ నిర్ణయమూ వ్యాపారవేత్తల కోసమే జరుగుతోందని మండిపడ్డారు. ఈ పరిస్థితులను మార్చడానికి మనమంతా ఐక్యం కావాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సుబోధ్ కుమార్ మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తాను ఓటు వేశానని, ఎస్ఐఆర్ తర్వాత ప్రచురించిన ముసాయిదా ఓట్ల జాబితాలో తన పేరును తొలగించారని అన్నారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంటుగా కూడా వ్యవహరించానని అన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి, ముసాయిదా ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన ఓటర్లు చాలామంది ఉన్నారని అన్నారు.

రాహుల్ వ్యాఖ్యలకు ఆర్‌జెడి నేత, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ మద్దతు పలికారు. బిజెపితో కలిసి ఇసి ఓట్లను లాక్కుంటుందని అన్నారు. చాలామంది ఓటర్ల పేరును తొలగించారని, బతికి ఉన్న వారిని చనిపోయినట్లు ప్రకటించారని మండిపడ్డారు. 20 ఏళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న ఖత్రా సర్కార్ (చెత్త ప్రభుత్వం)కి బీహార్ ప్రజలు గుణపాటం చెబుతారని అన్నారు. తన మామ నితీష్‌కుమార్ అపస్మారక స్థితిలో ఉన్నారని, బీహార్‌ను నియంత్రించలేకపోతున్నారని అన్నారు. బీహార్ అభివృద్ధిలో వేగాన్ని పెంచి, మహాఘట్బంధన్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రస్తుత నితీష్‌కుమార్ ప్రభుత్వాన్ని కూల్చివేసే సమయం ఆసన్నమైందని అన్నారు. కొత్త దార్శనికత కలిగిన యువకులమని, బీహార్‌ను నిర్మించడానికి అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తామని అన్నారు. ప్రధాని మోడీ బీహార్ యువతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని ప్రజలను కోరారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితా నుండి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించడానికి కుట్ర జరుగుతోందని వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముఖేష్ సహాని మరియు సిపిఐ(మార్కిస్ట్-లెనినిస్ట్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు.

